
నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024 HAPPY NEW YEAR





పార్టీ మండల, క్లస్టర్ కమిటీల నియామకం

చీరాల: చీరాల మున్సిపాలిటీతో పాటుగా చీరాల మండలం, వేటపాలెం మండలాల కమిటీని నియమించగా ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి విడుదల చేశారు. పట్టణ పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడిగా కోండ్రు బాబ్జి, క్లస్టర్–2 అధ్యక్షుడిగా గుంటూరు మాధవరావుతో పాటుగా క్లస్టర్–1 వైస్ ప్రెసిడెంట్లుగా మొగిలి బాబ్జి, కె.రాంబాబు, క్లస్టర్–2 వైస్ ప్రెసిడెంట్లుగా పి.వెంకటేశ్వరరావు, చుక్కా నాగలక్ష్మీతో పాటుగా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కమిటీలను నియమించారు. చీరాల మండల అధ్యక్షుడిగా ఆసోది అంకాళరెడ్డి, వైఎస్ ప్రెసిడెంట్లుగా పిట్టు పోలయ్య, దివి జయరాం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మరో ఇరవై మందిని నియమించారు. వేటపాలెం మండల పార్టీ అధ్యక్షుడిగా బొడ్డు సుబ్బారావు,వైస్ ప్రెసిడెంట్లుగా జంగిలి వెంకటరామారావు, అందె క్రిష్ణతో పాటుగాఇతర కమిటీసభ్యులనునియమిచారు. వైఎస్సార్ సీపీలో నూతనంగా పదవులు పొందిన వారు పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి,నియోజకవర్గవైఎస్సార్‌సీపీఇన్‌చార్జికరణంవెంకటేష్‌లు సూచించారు.

కొత్త పింఛన్లు మంజూరు

బల్లికురవ: ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్‌లో భాగంగా జనవరిలో మండలంలోని 20 సచివాలయాలకు 163 కొత్త పింఛన్‌లు మంజూరు చేసినట్లు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య ఆదివారం తెలిపారు. ఇప్పటికే వృద్ధాప్య, వితంతు, చేనేత, దివ్యాంగ, డప్పు కళాకారులు, ఒంటరి మహిళలకు 7941 మందికి పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పింఛన్‌ల పెంపులో భాగంగా జనవరి నుంచి రూ.3 వేలు అందజేస్తుందని, 4వ తేదీ నుంచి సచివాలయాల వారీగా వలంటీర్లు పింఛన్‌ల పంపిణీ చేపడతారని ఎంపీడీవో వివరించారు.

2 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాలోనే ప్రజలకు కార్పోరేట్ వైద్యాన్ని అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం నుంచి మే 7వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ ఆదివారం తెలిపారు. 2వ తేదీ మల్లాయపాలెం సచివాలయం, 9న కొత్తూరు, 19 న ఉప్పుమాగులూరు 1, 23 న వైదన, 30న వల్లాపల్లి, ఫిబ్రవరి 6న వేమవరం,13న ఎస్‌ఎల్ గుడిపాడు, 20న బల్లికురవ, 27 కూకట్లపల్లి, మార్చి 5 కొప్పరపాలెం, 12న కొప్పరపాడు, 19న చెన్నుపల్లి, 26న ముక్తేశ్వరం, ఏప్రిల్ 2న కొణిదెన, 8న వెలమవారిపాలెం, 16న పెదఅంబడిపూడి, 23న కొమ్మినేనివారిపాలెం, 30న నక్కబొక్కలపాడు, మే 7న ఉప్పుమాగులూరు 2 సచివాలయాల వద్ద జరిగే కార్యక్రమాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు.

జనవరి 10 నుంచి దుద్దుకూరులో వాలీబాల్ పోటీలు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని దుద్దుకూరు గ్రామంలోని బీసీ కాలనీ అంకమ్మతల్లి ఆలయం వద్ద జనవరి 10వ తేదీ నుంచి వంశీ మెమోరియల్ మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.15,116, రెండో బహుమతిగా రూ.11,116, మూడో బహుమతిగా రూ.7,116 అందించనున్నట్లు వారు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.600గా పేర్కొన్నారు. వివరాలకు నిర్వాహకులు నవీన్ 78939 46105, రవి 91210 30864, చైతన్య 63021 06433, సూర్య 95503 67741 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

చదవడంతో మరింత విజ్ఞానం

సంతమాగులూరు (అద్దంకి): చదవడంతో విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుందని గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులతో వివిధ రకాల పుస్తకాలను చదవడం వల్ల కలిగే ప్రయోనాలను వివరించారు. విద్యార్థులు ఎప్పుడైనా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకోవచ్చని చెప్పారు. పుస్తకం మంచి స్నేహితుడని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.







జూదరుల అరెస్టు

అద్దంకి రూరల్: స్థానిక విద్యుత్ భవన్‌లో పేకాట ఆడుతున్న నలుగురు ఉద్యోగులను ఆదివారం రాత్రి సీఐ రమేష్‌బాబు అదుపులోకి తీసుకున్నారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. అద్దంకిలోని సబ్ డివిజన్ విద్యుత్ భవన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్‌లుగా పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు కార్యాలయంలో ఆదివారం రాత్రి పేకాడుతున్న సమాచారం రావటంతో సిబ్బందితో కలిసి దాడిచేయగా పేకాట ఆడుతున్న ఉద్యోగులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 14,350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో ఆదివారం ఉదయం మార్టూరు పోలీసులు అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్న ఓవ్యక్తిని అదుపులోనికి తీసుకొని అతని నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎం శ్రీనివాసరావు వివరాల మేరకు.. స్థానిక శాంతినగర్ కాలనీలో తన్నీరు శ్రీనివాసరావు అనే వ్యక్తి అక్రమంగా మద్యం బాటిళ్లు సరఫరా చేస్తున్నట్లు తెలుసుకున్న ఎస్సై ఆదివారం ఉదయం అతని ఇంట్లో తనిఖీ చేశారు. అందులో భాగంగా శ్రీనివాసరావు ఇంటిలో నిల్వ ఉంచిన బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఘంటసాల గానహేల

చీరాల అర్బన్: పద్మశ్రీ ఘంటసాల సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం సాయంత్రం 5గంటలకు ఘంటసాల గానహేల పాటల కార్యక్రమాన్ని పట్టణంలోని ఎన్‌వీఎస్‌జెఆర్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు శనగవరపు నాగమల్లేశ్వరశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరై ఘంటసాల పాటలను ఆస్వాదించాలని కోరారు.


మార్టూరులోని ఓ స్వీట్ షాప్‌లోని మిఠాయిలు


అద్దంకిలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పూలు


అద్దంకి: స్వీటు దుకాణం ముందు ప్రజల హడావుడి

కొత్త ఏడాది.. కొత్త ఆశలు

- నూతన సంవత్సర వేడుకలను ముస్తాబు
- కేక్‌లు, స్వీట్లతో యువత, చిన్నారుల హడావుడి
- శుభాకాంక్షలతో హోరెత్తిన సోషల్ మీడియా

వేటపాలెం: పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఆశలతో కొత్త సంవత్సరానికి ప్రజలు ఆహ్వానం పలికారు. గత సంవత్సరంలో ఎన్నో మధుర స్మృతులు, కష్టనష్టాలను మరిచిపోతూ ఈఏడాది అంతా బాగుండాలని నూతనోత్సాహంతో గడపాలని కోరుకుంటున్నారు. ఈసందర్భంగా మొదటి రోజే చిన్నారులు, యువత, వృద్ధులు అన్న తేడా లేకుండా కేకులు, స్వీట్లు పంచుకున్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు నేడు కిక్కిరిసిపోనున్నాయి. 2023 సంవత్సరం వీడ్కోలు పలుకుతూ 2024 నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి వీధివీధినా దుఖాణాలు, ముస్తాబు చేశారు. వేడుకల కోసం బేకరీలు, స్వీట్ షాపుల వద్ద క్యూ కట్టారు.

మార్టూరు: జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి స్వీట్స్, ఫ్యాన్సీ షాపులు, బేకరీలు కస్టమర్లతో సందడి చేశాయి. ఎస్సై ఎం శ్రీనివాసరావు తమ సిబ్బందితో గస్తీ తిరుగుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.

చీరాల అర్బన్: కొత్త సంవత్సరానికి సరికొత్తగా స్వాగతం పలికేందుకు చీరాల పట్టణం సన్నద్ధమైంది. వాడవాడలా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరందుకున్నాయి. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు స్వాగత అక్షరాలు, అందమైన రంగవల్లులు ఇళ్ల ముందు కనిపించనున్నాయి. చీరాల పట్టణంలోని దర్బార్ రోడ్, కొట్లబజారు, గడియార స్తంభ సెంటర్, బస్టాండ్ సెంటర్లలో ప్రత్యేకంగా అంగళ్లు ఏర్పాటు చేసి స్వీట్స్, కేక్‌లు అమ్మకాలు చేపట్టారు. స్వీట్స్, కేక్‌లు షాపులు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. ప్రధాన వీధుల్లో కొనుగోలుదారులతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. కేక్స్ అమ్మకాలతో పాటు బిర్యాని సెంటర్లు కూడా ప్రత్యేక ఆఫర్లు ఏర్పాటు చేశారు. దేవాలయాల్లో తమ ఇష్ట దైవాలను పూజించి నూతన ఏడాదిని ప్రారంభించనున్నారు. అలానే క్రైస్తవ ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. అలానే క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగలు వరుసగా ఉండడంతో పలు వస్త్ర దుకాణాలు కూడా ప్రత్యేక ఆఫర్లను ప్రచారం చేస్తున్నాయి. న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసులు ముందస్తుగా ప్రటనలు చేశారు.

పర్చూరు (చినగంజాం): నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన పర్చూరులో నూతన సంవత్సర సందడి నెలకొంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు మండల ప్రజానీకం సద్ధమవుతున్నారు. వీధుల్లో సైతం ప్రజలు ఒకరినొకరు ముందుగానే శుభాకాంక్షలు తెలుపుకుంటూ, ఆప్యాయంగా పలకరించుకుంటూ సందడి చేశారు. ఆదివారం పర్చూరు బొమ్మల సెంటర్‌తో పాటు పలు సెంటర్‌లలో దుకాణాలు కొనుగోలు దారులతో కిక్కిరిసియాయి. దాంతో పాటు నియోజకవర్గంలోని మండలాలైన ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు, యద్దనపూడిలలో కొత్త సంవత్సర సందడి కనిపించింది.


న్యూ ఇయర్ సందర్భంగా కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు


చీరాలలో న్యూ ఇయర్ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకులు


పర్చూరులో కొనుగోలు దారులతో కిక్కిరిసిన స్వీట్ షాపు


కేకుల కొనుగోళ్లతో సందడిగా ఉన్న షాపు


అద్దంకిలో స్వీట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు


చీరాలలో స్వీట్లు కొనుగోలు చేస్తున్న జనం


వేటపాలెం రైల్వే స్టేషన్ రోడ్డు బేకరీ వద్ద కేకులు కోసం గుమిగూడిన ప్రజలు


మార్టూరులో ఓ దుకాణం ముందు స్వీట్లు కొనుగోలు చేస్తున్న జనం

నూతన సంవత్సర శుభాకాంక్షలు

అద్దంకి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి నియజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా నూతన సంత్సరంలో సుఖ సంతోషాలతో శాంతిగా ఉండాలని కోరారు. వారికి దేవుడు ఆయురారోగ్య అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని కోరారు. పట్టణంలోని శింగరకొండ రోడ్డులో ఉన్న వైఎస్సార్ సీపీ నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం వివిధ కార్యాక్రమాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తెలిపారు. దానిలో భాగంగా ఉదయం 9 గంటలకు ఆర్అండ్‌బీ బంగ్లాలో అందుబాటులో ఉంటారన్నారు. 10 గంటలకు శింగరకొండ దేవస్థానంలో ప్రత్యేక పూజలు, 11 గంటలకు నూతన పార్టీ కార్యాలయం ప్రారంభం, నూతన సంవత్సరం వేడుకలు నిర్వహిస్తారు. తరువాత హాజరైన వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.


పానెం హనిమిరెడ్డి


బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే


పోతుల సునీత ఎమ్మెల్సీ


కరణం వెంకటేష్

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, వెంకటేష్

చీరాల: నూతన సంవత్సరం సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. అలానే సోమవారం ఎమ్మెల్యే కరణం నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్‌ను పరామర్శించేందుకు హైద్రాబాద్ వెళ్తున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్సీ సునీత ఆకాంక్షించారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, మర్గశిరమాసం, మాఘ నక్షత్రం పంచమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నేడు చీరాలకు రానున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్

చీరాల: నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ వీక్లీ రైలు సోమవారం చీరాల రైల్వేస్టేషన్‌కు రానుంది. మాల్డా టౌన్ నుంచి బెంగళూరు వెళ్లే నూతన రైలును శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ రైలు సోమవారం చీరాల రైల్వేస్టేషన్‌కు రానున్న నేపథ్యంలో స్వాగత ఏర్పాట్లను రైల్వేశాఖ ఏర్పాటు చేసింది.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

దగ్గుబాడు (కారంచేడు): గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేటు వైద్యశాలలు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు, మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని దగ్గుబాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం ప్రారంభించి మాట్లాడారు. ప్రాణహిత మల్టీ స్పెషాలిటీ, క్యాన్సర్ సెంటర్ సహకారంతో నూర్‌అహ్మద్, విజయ్‌కుమార్‌ల సౌజన్యంతో గడ్డం ధర్మానందరావు, గడ్డం నారాయణరావుల జ్ఞాపకార్థం డాక్టర్ గడ్డం ప్రదీప్, డాక్టర్ చాపరాల శివానీలు తమ సిబ్బందితో కలసి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసారు. సుమారు 345 మందికి పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.


వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్‌లు

విద్యార్థులకు బుక్స్ పంపిణీ


విద్యార్థినిలకు పుస్తకాలు అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల విద్యాలయంలో పదోతరగతి చదవుతున్న విద్యార్థినులకు ప్రశ్న పత్రాలతో కూడిన పుస్తకాలను అందజేశారు. విద్యార్థిని సోముప్రవల్లిక పుట్టిన రోజు సందర్భంగా తండ్రి సోము రమణారెడ్డి సౌజన్యంతో అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దుర్గాగాయత్రి, రోటరీక్లబ్ అధ్యక్షుడు మలాది శ్రీనివాసరావు, సెక్రటరీ చప్పిడి వీరయ్య, అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లెవీ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024 HAPPY NEW YEAR

నవతరం కవితలు భావి కవులకు బాటలు


బీరం సుందరరావును సన్మానిస్తున్న సృజన సభ్యులు

అద్దంకి: నవతరం కవువలు భావి కవులకు బాటలని సాహితీవేత్త బీరం సుందరరావు అన్నారు. సృజన ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ గార్ల సేవా సదన్‌లో నవతరం కవులు అభివ్యక్త నైపుణ్యంపై ఆదివారం సాహిత్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి కే అనీల కుమారసూరి సభ ఆహ్వానం పలుకగా, సాహితీవేత్త గాడేపల్లి దివాకరదత్తు అధ్యక్షత వహించారు. సభలో నవతరం కవులు ఇలపావులూరి శేషతల్పసాయి, ఆర్‌వీరాఘురావు, పాలపర్తి జ్యోతిష్మతి, తమ స్వీయ కథా పఠనం చేశారు. అంటే వారు రచించిన కథలను, కవితలను సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నవతరం కవులు అభివ్యక్త నైపుణ్యం బీరం సుందరరావు మాట్లాడుతూ నవ్యకవుల కవితా రచన శైలి అద్భుతంగా ఉందన్నారు. వారి పద బంధాలు ఆలోచనా విధానం, తెలుగు కవిత్వంలోకి కొత్త కవి సమయాలను తీసుకుని వచ్చిందన్నారు. రావూరిరంగయ్య మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధి కోసం నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. డాక్టర్ యూ దేవపాలన మాట్లాడుతూ సమాజ హితమైన సాహిత్యాన్ని ప్రజలకు అందించిన వారిలో బీరం సుందరరావు ఒకరని చెప్పారు. ఆయన కవిత్వం సమాజానికి ఎంతో అవసరమన్నారు. తరువాత బీరం సుందరరావును సృజన తరుపున దుశ్శాలువా కప్పి జ్ఞాపకను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ వాసి రిటైర్డ్ డీఎస్పీ బీరం నాగేశ్వరరావు, రోటరీ బాధ్యుడు మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, నిమ్మరాజు నాగేశ్వరరావు, పసుమర్తి కోటయ్య, లక్కరాజు శ్రీనివాసరావు, డీవీఎం సత్యనారాయణ, వీరవల్లి సుబ్బారావు, ఆర్ వీ రాఘవరావు పూర్ణచంద్రరావు, షేక్ మస్తాన్, పీ శ్రీమన్నారాయణ, షేక్ మహ్మద్ రఫీ సాహితీ వేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ రక్షణ


విద్యార్థులచే వృక్షో రక్షిత రక్షితః సింబల్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు

ఇంకొల్లు (చినగంజాం): 2024లో మొక్కల పరిరక్షణ సంవత్సరం నినాదంతో విద్యార్థులందరూ ముందుకు సాగుదాం.. అని గ్రామ ప్రజల్లో చైతన్యం తీసుకొని వచ్చి మొక్కలు నాటి వాటి పరిరక్షణకు కృషి చేద్దాం అని ఇడుపులుపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తుగా 2024 నూతన సంవత్సరం విద్యార్థులతో పండుగ వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థులనుద్దేశించి హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి నిత్యం పాఠశాలకు వచ్చి ప్రభుత్వం అందిస్తున్న విద్యాభివృద్ధి పథకాలను అందిపుచ్చుకొని చదువుకోవాలని సూచించారు. పొదుపు నేర్చుకోవాలని, మొక్కలు పెంచాలని కోరారు. వృక్షాలను పెంచే విషయంలో గ్రామస్తులను చైతన్యవంతులను చేయాలని పర్యావరణ కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులచే వృక్షో రక్షిత రక్షితః సింబల్‌లో ఏర్పాటు చేసి ఆకర్షించారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్‌కోర్ విద్యార్థులు, నేషనల్ క్యాడెట్ కోర్ విద్యార్థులు, స్టూడెంట్ పోలీస్ క్యాడెట్ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భవానీలు, అయ్యప్ప స్వాముల పడిపూజలు


కారంచేడులో పడిపూజలకు సిద్ధమైన భవానీమాత


కారంచేడులో నగరోత్సవంతో అయ్యప్పస్వామి

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు శని, ఆదివారాల్లో ఘనంగా అయ్యప్పస్వాములు, భవానీ మాలదారుల పడిపూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్పస్వామి గుడిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువ జాము వరకు గ్రామంలో గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, మునికన్యలు, వివిధ దేవతల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గజరాజు (ఏనుగుతో) గ్రామంలో స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి గ్రామంలోని దుర్గామాత ఆలయం ఆధ్వర్యంలో భవానీమాతలు, భవానీ మాలధారులు పడి పూజలు నిర్వహించారు. కార్యక్రమంతో గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. కార్యక్రమంలో మునికన్యలు, అయ్యప్పస్వాములు, భవానీమాలధారులు, గురుస్వాములు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాద పద్మారాధన పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

వేటపాలెం: రావూరిపేటలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా వెంకటేశ్వర స్వామి వారి ప్రతిమను ఏర్పాటు చేసి 108 కలువ, తామరపూలతో ఆదివారం అష్టదళ పాద పద్మారాదన పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజులు చేశారు. వేదపండితులు ఘనాపాటి గుంటూరు మనోహర్, ఆలయ ప్రధాన అర్చకులు అలహరి నరసింహమూర్తి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరన నిర్వహించారు. కార్యక్రమంలో రామసేవా సంగం అధ్యక్షులు కొత్త శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గట్టా రమేష్, అనుమాల శెట్టి వెంకట సురేష్ పాల్గొన్నారు.

గ్రూప్-2 స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్ అందిస్తున్న అశోక్ కుమార్

చీరాల రూరల్: గ్రూప్–2 పోటీ పరిక్షల కోసం సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతీ, యువకులకు ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్ చేతులు మీదుగా ఉచితంగా గ్రూప్ 2 స్టడీ మెటీరియల్ అందజేశారు. రాయుడు రవికుమార్ సహకారంతో నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్లు అశోక్ కుమార్ పేర్కొన్నారు. దాతలు అందించిన సాయాన్ని యువకులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు.

గ్రూప్-2 పరీక్షకు నెల రోజుల ఉచిత శిక్షణ

చీరాల రూరల్/చీరాల టౌన్: సెయింట్ మార్క్స్ లూథరన్ ఎయిడెడ్ జూనియర్ కాలేజి, సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి, ప్రజా సంఘాల ఆధ్వరయలో గ్రూప్–2 పోటీ పరిక్షల కోసం సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం జనవరి 7వ తేదీ నుంచి నెల రోజులు పాటు స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ ఎయిడెడ్ జూనియర్ కాలేజినందు ఉచిత శిక్షణ తరగతులు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు రిటైర్డు లైబ్రేరియన్ జయశీలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలానే 6వ తేదిన సాయంత్రం 6 గంటలకు ప్రముఖ విద్యావేత్త, శాసన మండలి సభ్యులు కేఎస్. లక్ష్మణరావు నేతృత్వంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సదస్సుకు హాజరైన అభ్యర్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రుల చరిత్ర, భారత సమాజం అనే 200 పేజీలు కలిగిన పుస్తకాలను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. 6వ తేదీలోగా అభ్యర్థులు 98498 81826, 94406 66193 ఫోన్ నంబర్లకు ఫోన్‌చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు స్పందన రద్దు

చీరాల టౌన్: ప్రతి సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమాన్ని నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సోమవారం స్పందన రద్దు చేశామని వచ్చే సోమవారం యథావిధిగా స్పందన జరుగుతుందని అర్జీదారులు గమనించి అర్జీలు అందించేందుకు తహశీల్దార్ కార్యాలయానికి రావద్దని తహశీల్దార్ సూచించారు.